

# దిక్కు

రవి: గుర్రంతల తూర్పువైపుగా ఉంది. మరి తోక ఏవైపు చూపిస్తోందో చెప్పగలవా?

రఘు: ఎందుకు చెప్పలేను? పడమరవైపు!

రవి: తప్పు! భూమివైపు..

రఘు: ? ? ?

# కొరుక్కున్నా



**పిల్ల పాము:** అమ్మా మనలో విషం ఉంటుందా?

**తల్లి పాము:** అవున్నాన్నా ఎందుకు అలా అడుగుతున్నావ్?

**పిల్ల పాము:** ఏంలేదు. పొరపాట్న ఇందాక నాలుక కొరుక్కున్నాలే! ఏమైనా అవుతుందా?



# పరీక్ష

ఎనిమిదేళ్ల బాబీ బాలూల సంభాషణ..

**బాబీ:** మా కొత్తకుక్కను చూడ్డానికి వస్తావా ఇవ్వాళ?

**బాలూ:** అసలే కొత్తకుక్క అంటున్నావు.. కరవదుకదా?

**బాబీ:** అది తెలుసుకోడానికేగదా నిన్ను రమ్మంటోంది

**బాలూ:** ? ? ?

# ఏదో చెప్పు



ఎనిమిదేళ్ల కుర్రాళ్లు ఇద్దరు సంభాషణ.

**రాజు:** (ఏడుస్తూ) మీ తోటలో తేనెపట్టు చూపిస్తానంటే వచ్చాను.. చూడు మీ తేనెటీగ ఒకటి కుట్టింది ఇక్కడ?

**గిరి:** వెరీవెరీ సారీరా.. నిన్ను కుట్టిన ఆ తేనెటీగ ఏదో చూపించు దాని భరతం పడతా!

**రాజు:** ? ? ?



# ఇష్టం

**రమేష్:** మీకుక్కకు పిల్లలంటే ఇష్ట మేనా?

**సురేష్:** ఇష్టమే. కానీ గ్రేవీతో బిస్కెట్లంటే ఇంకా ఇష్టం

**రమేష్:** ? ? ?



# రెండోభాష

ఎలుకను, దాని పిల్లలను తరుముతోంది పిల్లి. తప్పించుకోవడానికి నానా తిప్పలు పడుతున్నాయి అవి. బాగా అలసిపోయిన తల్లి ఎలుక ఠక్కున ఆగి, వెనక్కు తిరిగి 'భౌభౌ.. భౌభౌ' అంటూ గట్టిగా అరిచింది.

అంతే.. పిల్లి కాస్తా పరార్!

అప్పుడు తల్లి ఎలుక పిల్లలతో 'రెండోభాష కూడా నేర్చుకోవడంవల్ల ఎంత లాభమో ఇప్పటికైనా మీకు తెలిసిందా? ' అంది.



# రుచి!

మూడేళ్ల చింటూను తీసుకుని స్నేహితురాలింటికి వెళ్లింది గిరిజ. వాళ్లింట్లోని పెద్దకుక్క చింటూ మీదకు దూకి, భుజాలమీద ముందుకాళ్లువేసి నిలబడి వాడి ముఖాన్ని నాకింది.. వాడు భయంతో కెవ్వుమన్నాడు..

కుక్కను గొలుసుతో కట్టేసినా ఏడుపు ఆపలేదు..

'ఎందుకేడుపు? అది నిన్నెక్కడన్నా కరిచిందా నాన్నా? ' అడిగింది గిరిజ.

'లేదు మమ్మీ.. కానీ రుచి చూసింది' అన్నాడు వాడు.



# ఎందుకంటే?

క్లాసులో అత్యాధునిక యంత్రాల పాఠం పిల్లలకు చెప్పిన టీచర్ 'మీ దృష్టిలో గొప్ప అత్యాధునిక యంత్రం ఏదో చెప్పండి? ' అని వారిని ప్రశ్నించింది.

సెల్‌ఫోన్, టీవీ, వాషింగ్ మిషన్, ఫ్రిజ్.. అంటూ చాలామంది ఇలాంటి జవాబులే చెప్పారు.

ఉష లేచి 'కోడి' అంది.

టీచర్ ఆశ్చర్యంగా చూసేసరికి- 'ఔను మేడమ్! తాలూ తప్ప, చచ్చు పుచ్చు గింజలు కడుపులో వేసుకుని తెల్లని గుడ్లను బయటకి తీస్తుంది.. అందుకే' అందామె ఆరిందాలా.



# మర్చిపోకేం?

పదేళ్ల నానీ తండ్రితో కల్సి జూలో జంతువుల్ని చూస్తున్నాడు.

నానీ: అదేం జంతువు నాన్నా .. చాలా ముద్దుగా ఉంది?

తండ్రి: దాన్ని పోనీ అంటారు. అంటే పొట్టి గుర్రం

నానీ: ఓహో! ఒకవేళ నేను దాన్ని ఎత్తుకుపోతే ఏమౌతుంది?

తండ్రి: నిన్ను జైల్లో పెడతారు..

నానీ: సరే నేను జైల్లో ఉన్నప్పుడు ఇంట్లో దానికి మేతవేయడం మాత్రం నువ్వు మర్చిపోకేం?

తండ్రి: ? ? ?



# అవసరం

పదేళ్లవయసులో ఓ చిలకను కొనుక్కొచ్చాడు జానీ. ఐదేళ్ల పాటు దానికి మాటలు నేర్పాలని ప్రయత్నించినా అది ఉలకలేదు.. పలకలేదు.

ఐదేళ్ల తర్వాత ఒకరోజు చిలక-

'ఛీఛీ ఈ జాంపండంతా కుళ్లింది.. యాక్! పురుగులు కూడా ఉన్నాయిందులో' అంటూ గట్టిగా అరిచింది.

జానీ ఆనందాశ్చర్యాలతో కెవ్వుమన్నాడు. 'ఏమిటి నిజంగా నువ్వే మాట్లాడావా?' అని దాన్ని అడిగాడు.

'అవును.. ఎందుకు డౌటు?'

'మరి ఇన్నేళ్లూ మాట్లాడలేదేం?'

'ఇన్నేళ్లూ నా మొహాన మంచి పండ్లే తగలేశావ్‌గా!' చిరాకుపడింది చిలక.